క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి



పెడన: నందమూరు పంచాయతీ కోటవానిపాలెం గ్రామానికి చెందిన కాగిత నాగమణి (65) అనుమానాస్పదంగా మృతి చెందింది. వీఆర్వో కిషోర్ తెలిపిన వివరాల మేరకు... కోటవానిపాలెం నుంచి నందమూరు గ్రామానికి రావడానికి దగ్గర మార్గం చేపల చెరువు గట్లపై నుంచి వస్తుంటారని, ఇదే క్రమంలో ఒంటరి వృద్ధురాలు ఆ విధంగా వస్తూ చెరువులో పడి చనిపోయి ఉండవచ్చని తెలిపారు. వీఆర్వో పంచనామా నిర్వహించారు. ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

సీఎస్ఐ దేవాలయం ప్రారంభోత్సవం

పెడన: మండల పరిధిలోని నందిగామ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ దేవాలయాన్ని బుధవారం ప్రారంభించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులు హాజరైన క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలను తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, రాజులపాటి అచ్యుతరావు, గరికపాటి వెంకట రామానాయుడు, ఎంపీటీసీ బొడ్డు గురున్నాథం తదితరులు పాల్గొన్నారు.

రేపు మచిలీపట్నంలో జాబ్‌మేళా

మచిలీపట్నంటౌన్: జాబ్‌మేళా కార్యక్రమం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవరపల్లి విక్టర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమో ఇన్ మెకానిక్స్, ఏదైనా డిగ్రీ చదివి, 18 నుంచి 35 సంవత్సరాల్లోపు యువతీ, యువకులు హాజరుకావచ్చునన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 81424 16211 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

గౌడ సంఘం నాయకుడు సతీష్ మృతి

పెడన: గౌడ సంఘం పెడన పట్టణ అధ్యక్షుడు పడమట నాగ కల్యాణ్ సతీష్ (బాబి) బుధవారం ఉదయం మృతిచెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు. ఆయన మృతదేహాన్ని రాష్ట్ర మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, ఉప్పాల రాము, మున్సిపల్ మాజీ చైర్మన్ బండారు ఆనందప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

ఉచిత దర్శనం కల్పించాలి

పెడన: పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో అమ్మవారిని ఉచితంగా భక్తులు దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలని హిందూ పరిషత్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు ఆలయ ఈఓ మోహనరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గుప్తా, కోటి, రంగ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కులగణన

పెడన: కులగణన పక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని, సంబంధిత సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని మున్సిపల్ అధికారులు తెలిపారు. బుధవారం చైర్‌పర్సన్ చాంబర్‌లో కులగణనపై పట్టణ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కులగణన ప్రక్రియను ప్రజాప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, బాబులాల్, కమిషనర్ మహేంద్ర, టీపీఓ ఏసుబాబు, సీనియర్ అసిస్టెంట్ సుందరం తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం జాబితాల ప్రదర్శన

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలంలో మిచాంగ్ తుపానుకు దెబ్బతిన్న పంట నష్టం వివరాల జాబితాలను మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద బుధవారం ప్రదర్శించామని ఏఓ మురళీకృష్ణ తెలిపారు. జాబితాలను పంట దెబ్బతిన్న రైతులు పరిశీలించుకోవాలని సూచించారు. దేవరకోట ఆర్‌బీకేలో సర్పంచ్ వెంకటేశ్వరరావు జాబితాను ప్రదర్శించారు.

తరగతి గదుల్లో సాంకేతిక విప్లవం

- 2023–24 విద్యాసంవత్సరానికి ట్యాబ్‌లు సిద్ధం
- నేడు తొలి విడతగా విద్యార్థులకు అందజేత
- పామర్రులో లాంఛనంగా ప్రారంభం
- హాజరుకానున్న జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు



ట్యాబ్‌లను అందజేస్తున్న అధికారులు

కంకిపాడు: విద్యార్థి దశ నుంచే సాంకేతిక పరిజ్ఞానం అందేలా ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థులు నైపుణ్యాలను సొంతం చేసుకునేలా విద్యాబోధనలో విప్లవాత్మక సంస్కరణలను చేపట్టింది. ఏటా సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారిస్తూ విద్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తోంది. సాంకేతిక విజ్ఞానం అందించే క్రమంలో విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తుంది. విద్యాశాఖ పర్యవేక్షణలో జిల్లాలో ఈనెల 21న ట్యాబ్‌ల పంపిణీ జరగనుంది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

ట్యాబ్‌ల పంపిణీకి సర్వం సిద్ధం....

వరుసగా ఈ ఏడాది కూడా బైజూస్ కంటెంట్ ఉన్న ట్యాబ్‌లను విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఏడాది కృష్ణా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 12131 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరికి తొలి విడతలో 6991 ట్యాబ్‌లను అందించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఇంకా 5140 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందాల్సి ఉంది. మలి విడతలో మిగిలిన విద్యార్థులకు ట్యాబ్‌లను అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నేడు పామర్రులో జిల్లా స్థాయి కార్యక్రమం...

జిల్లా స్థాయిలో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం పామర్రు జెడ్పీపాఠశాలలో గురువారం ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కానుంది. సీఎం వైఎస్ జగన్ ట్యాబ్‌లను లాంఛనంగా అందించిన తరువాత జిల్లా స్థాయిలో పంపిణీ ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి హాజరుకానున్నట్లు డీఈఓ తాహెరా సుల్తానా తెలిపారు.

గతేడాది 12,606 ట్యాబ్‌ల పంపిణీ..

గత విద్యాసంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ఎనిమిదో తరగతి చదువుతున్న 12606 మంది విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లను అందించింది. 2283 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను సరఫరా చేసింది. ట్యాబ్‌ల ద్వారా బోధన, ట్యాబ్‌ల వినియోగంపై ఉపాధ్యాయులకు క్షేత్రస్థాయి శిక్షణలు ఇచ్చారు. అంతేకాకుండా నేర్చుకున్న పాఠ్యాంశాలకు సంబంధించి సందేహాలు నివృత్తి, కొత్త అంశాల పట్ల అధ్యయనం, తదితర అంశాలను ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు నేర్చుకున్నారు. ఈ ఏడాది కూడా అంతకంటే ఎక్కువ సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు అందించేందుకు అనుగుణంగా ట్యాబ్‌లను సిద్ధం చేశారు. ఎనిమిదో తరగతి పాఠ్యాంశాలతో పాటు ఇంటర్మీడియట్ పాఠ్యాంశాలు, అందుకు అవసరమైన కంటెంట్‌ను పొందుపర్చినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

సాంకేతికతతో విజ్ఞానం పెంపు



ప్రస్తుత పరిస్థితుల్లో చిన్ననాటి నుంచే సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం. విద్యార్థులను అంతర్జాతీయంగా తీర్చిదిద్దేందుకే ఆంగ్ల మాధ్యమం, ట్యాబ్‌ల పంపిణీ వంటి విద్యా సంస్కరణలు ప్రభుత్వం చేపట్టింది. మంచిని గ్రహించి, చెడుకు దూరంగా ఉండటంతో తొలుత తల్లిదండ్రులు, తరువాత ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి. అప్పుడే విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను సాధించగలరు. – తాహెరా సుల్తానా, డీఈఓ, కృష్ణాజిల్లా

అధునాతన పరిజ్ఞానం



ఎనిమిది, ఆ పై తరగతుల పాఠ్యాంశాలను సైతం ఈ దఫా ట్యాబ్‌లలో నిక్షిప్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువులో రాణించేలా, ప్రతిభా పరీక్షల్లో సత్తా చాటేలా చేయటమే లక్ష్యం. ఈ ఏడాది ట్యాబ్‌ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని, చదువుల్లో రాణించాలి.

– మహమ్మద్ దావూద్ షేక్, జిల్లా నోడల్ అధికారి, కృష్ణాజిల్లా





సందడిగా బాలోత్సవం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో 6వ అమరావతి బాలోత్సవం రెండో రోజైన బుధవారం సందడిగా సాగింది. సీనియర్స్ విభాగంలో విద్యార్థులు చేసిన కోలాటం ఆకట్టుకుంది. జూనియర్స్ విభాగంలో విచిత్ర వేషధారణ, జూనియర్స్ లఘు నాటిక, సీనియర్స్ విభాగంలో క్లాసికల్, సీనియర్స్ దేశభక్తి గీతాలాపన, సబ్ జూనియర్స్ విభాగంలో కథలు చెప్పడం నిర్వహించారు. జూనియర్స్ పద్యం భావం చెప్పడం, తెలుగులో మాట్లాడటం, చిత్రలేఖనం వ్యాసరచన, స్పెల్ బీ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారిలోని ప్రతిభను చూపారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల్లోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.

నేడు బహుమతుల ప్రదానం

మూడు రోజుల పాటు జరిగిన బాలోత్సవంలోని వివిధ పోటీల్లో విజేతలకు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు బహుమతుల ప్రధానం జరుగుతుందని అమరావతి బాలోత్సవం నిర్వాహకులు తెలిపారు.





స్నేహం పేరుతో చీటింగ్

యువతి నుంచి 64 గ్రాముల బంగారం, రూ.33 వేలు నగదు తీసుకొని మోసం చేసిన యువకుడు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్నేహం పేరుతో పరిచయమైన ఓ వ్యక్తి తన తండ్రికి ఆరోగ్యం బాగోలేదని నమ్మించి తన వద్ద నుంచి 64 గ్రాముల బంగారం, 33 వేల రూపాయల నగదు తీసుకొని మోసం చేశాడని ఓ యువతి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగ్‌నగర్ నందమూరినగర్‌కు చెందిన యువతి ఓ ప్రైవేటు కాలేజ్‌లో బీటెక్ రెండో సంవత్సరం చదువుతుంది. ఏడాది క్రితం పీవీపీ మాల్‌కు వెళ్లగా అక్కడ హేమంత్ మణికంఠ అనే యువకుడు పరిచయమయ్యాడు. అప్పటి నుంచి ఫోన్‌లో మాట్లాడుతూ ఉండేవాడు. ఈ ఏడాది మార్చి నెలలో ఫోను చేసిన అతను తన తండ్రికి ఆరోగ్యం బాలేదని, వెంటనే డబ్బులు కావాలని చెప్పడంతో తన ఒంటిమీద ఉన్న రెండు బంగారపు చైన్లను యువతి తీసి ఇవ్వగా మరుసటి రోజు వాటిని తిరిగి ఇచ్చేశాడు. మళ్లీ కొన్ని రోజులు గడిచాక మా నాన్నకు సీరియస్‌గా ఉందని, ఐసీయూలో పెట్టారు వెంటనే డబ్బులు కావాలని ఫోను చేయగా యువతి తనకు సంబంధించిన 64 గ్రాముల బంగారం, రూ.33 వేల నగదును ఫోన్‌పే ద్వారా హేమంత్‌కు పంపింది. ఆ తరువాత బంగారం కోసం, డబ్బుల కోసం ఫోన్లు చేస్తుండగా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తూ వస్తున్నాడు. నెలలు గడుస్తున్నా అతని నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో మోసపోయినట్లు భావించిన ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో శారదా నగర్‌లో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాస్టర్ ఉపేంద్ర క్రిస్మస్ సందేశమిచ్చారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) కేక్ కట్ చేశారు. స్థానిక పంపులచెరువు వద్ద ఎలక్ట్రికల్ ఈఈ కార్యాలయం ఉద్యోగుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యుత్ మచిలీపట్నం డివిజన్ ఈఈ మన్నెం భాస్కరరావు కేక్ కట్ చేశారు. శారదానగర్‌లోని ఐపీసీ చర్చి స్వస్థత ప్రార్థనా మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఉత్సవ ఛత్రాల సమర్పణ

అవనిగడ్డ: స్థానిక గీతా మందిరానికి ఉత్సవ సమయాల్లో స్వామి వారికి వేసేందుకు రెండు గొడుగులను చెన్నైకి చెందిన ఇంజినీర్ కె. గంగేశ్వరరావు–అంజనాదేవి దంపతులు బహూకరించారు. రూ.18 వేల విలువైన గొడుగులను అర్చకుడు దీవి నరసింహమూర్తి ద్వారా స్వామి వారికి అందజేశారు.

విద్యార్థుల ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు

జేసీ అపరాజిత సింగ్



ప్రతిభ చాటిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న జేసీ అపరాజిత సింగ్, డీఈఓ తాహెరా సుల్తానా

ఉయ్యూరు: విద్యార్థుల ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ అన్నారు. జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఉయ్యూరులో బుధవారం నిర్వహించారు. డీఈఓ తాహెరా సుల్తానా, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) ప్రదర్శనను ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు విద్యార్థులు తాము రూపొందించిన ఆవిష్కరణలను ప్రదర్శించారు. విజేతలకు జేసీ బహుమతులు అందించారు. తహసీల్దార్ మస్తాన్, పలువురు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. టీచర్ల విభాగంలో ఎం.శ్యాంకుమార్ (జెడ్పీహెచ్ కపిలేశ్వరపురం), బి.వెంకట సుబ్బారావు (జెడ్పీహెచ్ పెడసనగల్లు), జి.కృష్ణమోహన్ (జెడ్పీహెచ్ తలగడదీవి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. గ్రూప్ విభాగంలో ప్రథమ స్థానంలో ఎన్.గోపాలకృష్ణ, వి.జితేంద్రనాగపవన్ (జెడ్పీ మేడూరు), ద్వితీయ స్థానంలో ఎస్.వసంతసాయి, భార్గవ్‌రామ్ (ఏఎస్ఎంపీఎల్ హైస్కూల్, గుడివాడ), తృతీయ స్థానంలో సీహెచ్ శ్రావణి, జి.రత్నకుమారి (జెడ్పీ నందివాడ), నిలిచారు. వ్యక్తిగత విభాగంలో ప్రథమస్థానంలో ఆర్‌డీ చంద్రశేఖర్ (ఎస్ఎంకే జెడ్పీ, మొవ్వ), ద్వితీయస్థానంలో కె.యుక్తామణి (జెడ్పీ, తెన్నేరు), తృతీయ స్థానంలో సీహెచ్ విశ్వనాథ్ (జెడ్పీ కంచడం, బంటుమిల్లి) నిలిచారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు పతకాలు



పతకాలతో వాసవి పాలిటెక్నిక్ విద్యార్థులు

పెడన: నందమూరు శ్రీ వాసవి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఐపీఎస్‌జీఎం–2023 రీజనల్ మీట్‌లో వివిధ ఆటల పోటీల్లో పతకాలను సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీకే ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజులుగా జరిగిన పాలిటెక్నిక్ అంతర కళాశాలల ఆటల పోటీల్లో వివిధ విభాగాల్లో వాసవి పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు కైవశం చేసుకున్నారు. డిస్కస్ త్రోలో వై. తరుణ్ రజిత పతకం, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లలో వేర్వేరుగా జి. దయాషద్రక్ కాంస్య పతకాలు సాధించాడు. 400 రిలే పరుగుపందెంలో పి. పార్థసారథి, ఆర్. పవన్ శ్రీనివాస్, కె. జితేంద్ర, ఎండీ రాజాలు కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. వంద మీటర్ల పరుగు పందెంలో వి. జైదీప్ రజతం, కబడ్డీలో దయాషద్రక్, రమేష్, లక్ష్మణస్వామి, సి. శ్రీనివాస్, సూర్యప్రకాశరావు రజత పతకాలను సాధించారని చెప్పారు.

వీరిలో తరుణ్, జైదీప్‌లు అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జనవరిలో హాజరవుతారని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను, కోచ్ రమేష్‌ను కళాశాల చైర్మన్ గుడివాడ ప్రసాద్, కార్యదర్శి తాడేపల్లి మెహర్‌బాబా, కరస్పాండెంట్ కుమార్ బాబు అభినందించారు.

వైభవంగా హరిహరపుత్రుని గ్రామోత్సవం

చల్లపల్లి: హరిహర పుత్రుని గ్రామోత్సవం శోభాయమానంగా జరిగింది. కాంతారా కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. బుధవారం సాయంత్రం స్థానిక నిమ్మలతోటలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి క్షేత్రంలో పడి పూజా మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు అన్నవరపు పాండురంగారావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు భాను నంబూద్రి స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. భక్తులకు స్వామివారి నిజరూప దర్శనభాగ్యం కల్పించి మహాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తిని ప్రత్యేక వాహనంపై అలంకరించి వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం కళాకారులచే ఏర్పాటు చేసిన మహిషాసుర మర్దిని నృత్య ప్రదర్శన, కాంతారా కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

పెడన: ఓటర్లు అధిక సంఖ్యలో హాజరయ్యే పోలింగ్ స్టేషన్లలో మూడు అంత కంటే ఎక్కువ ఉన్న బూత్‌ల వద్ద సౌకర్యాలను పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె. రాజ్యలక్ష్మి బుధవారం పరిశీలించారు. పెడన నియోజకవర్గంలోని పెడన పట్టణంతో పాటు పెడన రూరల్, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో పర్యటించి ఆయా పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పెడన నియోజకవర్గ వ్యాప్తంగా మూడు బూత్‌లున్న పోలింగ్ స్టేషన్లు 14 ఉన్నాయని, నాలుగు బూత్‌లున్నవి రెండు, ఐదు బూత్‌లున్నవి ఒకటి ఉందని చెప్పారు.

ఈ పోలింగ్ స్టేషన్లకు ఓటర్లు అత్యధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో వీటి వద్ద కనీస సౌకర్యాలు, మౌలిక వసతులు, ర్యాంపు వంటి వాటిని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో పురపాలక అధికారులు, రెవెన్యూ అధికారులు బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

పెడన: దుకాణానికి వెళ్లిన మహిళ తిరిగి రాలేదని ఆమె భర్త పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బల్లిపర్రు గ్రామానికి చెందిన ముద్దినేని జ్యోతి (35) మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి దుకాణానికి వెళ్లింది. ఎంత సేపటికి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా కనిపించకపోవడంతో ఆమె భర్త సాంబయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అయ్యప్పకు పంచామృతాభిషేకం

కోడూరు: అపర శబరిమలగా పేరుగాంచిన కోడూరు అయ్యప్పస్వామి వారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ గురుస్వామి పర్యవేక్షణలో అయ్యప్ప మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకారం చేశారు. 350 మంది దీక్షధారులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రగ్గుల పంపిణీ

అవనిగడ్డ: పంచాయతీ పరిధిలోని పలు చర్చిల్లో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. స్థానిక సీతాయిలంకలోని రవి పాస్టర్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో శ్రీ రామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిశోర్ నాయుడు 40 మంది విశ్వాసులకు రగ్గులు పంపిణీ చేశారు. 2వ వార్డులోని ఎస్టీ కాలనీ సర్వ కృపా ప్రార్థనా మందిరంలో జరిగిన కార్యక్రమంలో 20 మందికి చీరలు పంపిణీ చేశారు. తొలుత ఆయా చర్చిల్లో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్స్ విలియం కేరీ, జయరాజు, స్టీఫెన్, ప్రసాద్, జీవన్ ప్రసాద్ పాల్గొన్నారు.

అన్నదానం

కృత్తివెన్ను: షష్ఠి ఉత్సవాలను పురస్కరించుకుని గరిశపూడిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం వద్ద బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ స్వామి వారికి పూజలు జరిపారు. అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు వడ్డించారు. సర్పంచ్ నాగిడి నాగార్జున, నాయకులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

అవనిగడ్డ: స్థానిక ఐదో వార్డులోని సైబర్ జోన్ వద్ద వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ రెండో బ్యాచ్ బుధవారం ప్రారంభమైంది. సంస్థ చైర్మన్ ఎం. ఈశ్వరరెడ్డి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, షేక్ నజీర్‌బాషా పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు పాటించాలి

కోనేరుసెంటర్: ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపు పాటించాలని విద్యుత్‌శాఖ ఈఈ భాస్కర్ అన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా బుధవారం మచిలీపట్నం మెడికల్ కళాశాలలో విద్యుత్ పొదుపు భద్రతపై మెడిసిన్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భాస్కర్ మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవటం ద్వారా అనేక ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆశారాణి, విద్యుత్ డీఈఈలు, ఏఈలు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వామివార్ల సేవలో నాగిరెడ్డి దంపతులు

మోపిదేవి: మోపిదేవిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్లను రైతు విభాగం రాష్ట్ర చైర్మన్, వ్యవసాయ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి దంపతులు స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్ధ సతీష్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించారు.



సిఫార్సులు లేకుండా ప్రభుత్వ వైద్య సేవలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

పెదప్రోలు(మోపిదేవి): ఎలాంటి సిఫార్సులు లేకుండా ఆరోగ్య శ్రీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. పెదప్రోలు సచివాలయం వద్ద ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే సింహాద్రి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ డాక్టర్ హారిక అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడారు. కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైనా, ప్రమాదం జరిగినా ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య సేవలు పొందవచ్చునని వివరించారు. పేద వర్గాలకు విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ఇలాంటి ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి దీవించాలని కోరారు. జిల్లా కో-ఆర్డినేటర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటా ఎంతమంది ఉన్నా అందరికీ బయోమెట్రిక్, ఓటీపీలో క్యూఆర్‌కోడ్ ద్వారా ఆరోగ్య శ్రీ కార్డులు అందిస్తామని, ఒక్క పెదప్రోలు గ్రామంలోనే 1,225 కార్డులు అందిస్తామని తెలిపారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు, ఏఎంసీ డైరెక్టర్ పరమేశ్వరి, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, పలువురు పీఏసీఎస్ చైర్ పర్సన్‌లు, నాయకులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

సామాజిక న్యాయమంటే ఏమిటో చూపిన జగన్



పెడన: రాష్ట్రంలో సమన్యాయం చేస్తూ పార్టీలకు అతీతంగా అటు పేదవారికి సంక్షేమ ఫలాలను అందిస్తూ ఇటు అన్ని సామాజిక వర్గాలకు పదవుల్లో అవకాశం కల్పించిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. బుధవారం ఆయన 9వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాజీవ్ మాట్లాడుతూ అర్హులైన పేదవారికి పార్టీలను చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలను అందించిన జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు, పిచ్చిక సతీష్, నాయకులు నాగకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 6, 20, 47 డివిజన్లలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కిట్టు మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అమలు కాని పలు సంక్షేమ పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. దేశంలోని పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సీఎం జగన్ పాలనను కొనియాడుతూ ఆయా రాష్ట్రాల్లో కూడా పథకాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. సీఎం జగన్‌ను అన్నివర్గాల ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆయా డివిజన్లలో సంక్షేమ బోర్డులను, పార్టీ జెండాలను ఆవిష్కరించారు. డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం మారుతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు గూడవల్లి నాగరాజు, మేకల సుబ్బన్న, కాగిత జవహర్ లాల్, కార్పొరేటర్లు పర్ణం సతీష్, వరప్రసాద్ పాల్గొన్నారు.


బందరు ఆరో డివిజన్‌లో బోర్డును ఆవిష్కరించిన పేర్ని కిట్టు



ముగిసిన షష్ఠి ఉత్సవాలు

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి స్వామి వార్ల పవళింపు సేవతో ముగిశాయి. స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి ద్వాదశ ప్రదక్షిణలు, అనంతరం రాత్రి 9 గంటలకు స్వామివారి పుష్పశయ్యాలంకృత సేవ, తీర్థప్రసాద వినియోగం జరిగాయి.

స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్‌లో ప్రతిభ

నాగాయలంక: రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ సెలక్షన్స్‌లో సిల్వర్ మెడల్స్ సాధించిన నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు కొక్కిలిగడ్డ విన్ని, నాయుడు అశ్విని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం కె.శాంతకుమారి బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18, 19 తేదీల్లో పెనమలూరు బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో పోటీలు జరిగాయన్నారు. స్విమ్మింగ్‌లో విన్ని, అశ్విని రజత పతకాలు సాధించారని చెప్పారు. విద్యార్థినులను పలువురు అభినందించారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు



కోడూరు: బాలోత్సవంలో భాగంగా విద్యార్థుల క్రీడాపోటీలు బుధవారం స్వతంత్రపురం జెడ్పీ క్రీడా ప్రాంగణంలో మూడు విభాగాల్లో నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్, సబ్ జూనియర్స్‌గా విద్యార్థులను విభజించి పోటీలు జరిపారు. రన్నింగ్, లాంగ్ జంప్, షార్ట్‌పుట్, త్రోబాల్ పోటీలను నాలుగు నుంచి పదో తరగతి విద్యార్థులకు నిర్వహించారు. ఫ్రాగ్ జంప్, రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్ పోటీలను ఒకటి నుంచి మూడు తరగతి విద్యార్థులకు నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.





